సాక్షి కామారెడ్డి

బుధవారం । 20 । ఆగస్టు । 2025



కారాదు విషాదం..

నవరాత్రి ఉత్సవాలలో విద్యుత్ విషయంలో, నిమజ్జన సమయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

- 8లో ▸



ఇళ్లు కట్టుకోవాలి

రేకుల పెడ్లు, గుడిసెల్లో నివసిస్తున్నవారు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 27.6 /21.3

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'నానో యూరియాతో రైతులకు మేలు'



పిట్లం: రైతులు సాధారణ యూరియా వాడకాన్ని తగ్గించి నానో యూరియాను వాడితే ఖర్చులు తగ్గుతాయని డీఏవో మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన మంగళవారం పిట్లంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. యూరియా లభ్యత, పంపిణీ వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవోలు సురేష్, వీణ పాల్గొన్నారు.

'పంచసూత్రాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి'



కామారెడ్డి అర్బన్: రాష్ట్రీయ సేవక్ సంఘ్ పంచసూత్రాలైన పర్యావరణం, సామాజిక సామరస్యం, స్వబోధ, పౌరమర్యాదలు, కుటుంబ జ్ఞానోదయం అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని ఆర్‌ఎస్‌ఎస్ ఇందూర్ విభాగ్ ప్రచారక్ శివకుమార్ పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో మంగళవారం జిల్లాకేంద్రంలోని శ్రీ సరస్వతి విద్యామందిర్ హైస్కూల్ ఆడిటోరియంలో సంఘ్ విస్తృత స్థాయి కార్యకర్తల సమ్మేళనం నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంఘ్‌చాలక్ బొడ్డు శంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వివిధ సామాజిక అంశాలపై మాట్లాడారు. జిల్లాలోని ప్రతిగ్రామంలో శాఖలు ప్రారంభించి బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సహకార్యవాహ కొమిరెడ్డి స్వామి, నగర కార్యవాహ కొత్తోళ్ల శివరాజ్ తదితరులు పాల్గన్నారు.

ఆయకట్టుకు ఢోకా లేదు



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఆయకట్టు రెండు పంటలకు ఢోకా లేదని రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. దేవాదాయ శాఖ మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి శ్రీరాంసాగర్ ప్రాజెక్టును మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి బేసిన్‌లోని అన్ని ప్రాజెక్ట్‌లు నిండటం ఆనందకరమన్నారు. ఎస్సారెస్పీని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

తల్లిదండ్రి.. తల్లడిల్లేలా..



కన్నవారిని వృద్ధాప్యంలో కంటికి రెప్పలా చూసుకోవాల్సిన పిల్లలు.. వారిని పట్టించుకోవడం లేదు. ఆస్తులు పంచుకుంటున్న సంతానం.. తనువిచ్చిన తల్లిదండ్రులకు కడుపునిండా అన్నం పెట్టడానికి మాత్రం ముందుకు రావడం లేదు. తిండికి బదులు ఈసడింపులు మాత్రం వడ్డిస్తున్నారు. తమను కని, గారాబంగా పెంచి, పెద్ద చేసినవారిని కొందరు దిక్కులేనివారిలా వృద్ధాశ్రమంలో వదిలేస్తుండగా, ఇంకొందరు దారుణంగా రోడ్డున పడేస్తున్నారు. దీంతో కన్నవారు తల్లడిల్లుతున్నారు.

- మునలోళ్లయ్యారని వదిలించుకుంటున్న సంతానం
- అందరు ఉన్నా అనాథలుగా జీవిస్తున్న పలువురు వృద్ధులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : అమ్మ నవమాసాలు మోసి జన్మనిస్తుంది. నాన్న తన భుజాలపై మోసి పెంచుతాడు. బిడ్డ ఆకలి తీర్చేందుకు తమ ఆకలిని మరచిపోతారు. పిల్లల భవిష్యత్ కోసం తమ కోరికలను త్యజిస్తారు. కష్టాలను తాము మోసి.. బిడ్డలకు మంచి జీవితాన్ని ఇవ్వడానికి ఆరాటపడతారు. పెరిగి పెద్దయ్యేదాకా కంటికి రెప్పలా కాపాడుకునే తల్లిదండ్రులు..తమకు చేతనైనన్ని రోజులు మన కోసమే కష్టపడతారు. వయసురీత్యా సంక్రమించే వ్యాధులతో తమ పని కూడా తాము చేసుకోలేని పరిస్థితుల్లో ఉన్నవారికి మేమున్నామనే భరోసా ఇవ్వాల్సిన కొడుకులు, కోడళ్లు.. వారిని భారంగా భావిస్తున్నారు. జీవిత చరమాంకంలో వారి ఆలనాపాలనా చూడకుండా నిర్దాక్షిణ్యంగా వదిలేస్తున్నారు. కంటికి రెప్పలా కాపాడుకోవలసిన బాధ్యతల నుంచి చాలా మంది తప్పుకుంటున్నారు. ఇటీవల కామారెడ్డి రైల్వేస్టేషన్ వెనకవైపు ఉన్న షెడ్డు కింద వృద్ధురాలు శకుంతల పడుతున్న ఇబ్బందుల్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకురావడంతో అధికారులు స్పందించి ఆమెను వృద్ధాశ్రమానికి చేర్చారు. రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ 'సాక్షి' కథనాన్ని సుమోటోగా తీసుకుని కేసు నమోదు చేసింది.


అభ్యాగ్యులు ఎందరో..

శకుంతల ఉదంతం వెలుగులోకి వచ్చింది. కానీ ఇలా వెలుగులోకి రాని వారందరో ఉన్నారు. కన్నబిడ్డలు కాదనడంతో ఎందరో అభాగ్యులు వృద్ధాశ్రమాలు, అనాథ శరణాలయాల్లో ఆశ్రయం పొందుతున్నారు. జీవిత చరమాంకంలో మనవలు, మనవరాళ్లతో ఆనందంగా గడపాల్సిన వారు అందరు ఉన్నా అనాథలుగా బతకాల్సి వస్తోంది. కామారెడ్డి పట్టణానికి సమీపంలోని ఓ వృద్ధాశ్రమంలో 25 మంది వరకు వృద్ధ మహిళలు ఉంటున్నారు. అలాగే లింగంపేటలోని ఆశ్రమంలో తొమ్మిది మంది ఉంటున్నారు. పొరుగునే ఉన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలోని ఓ ఆశ్రమంలో జిల్లాకు చెందిన వృద్ధులు పలువురు ఆశ్రయం పొందుతున్నారు. సిద్దిపేట జిల్లా వర్గల్ సమీపంలో ఉన్న ఓ ఆశ్రమంలోనూ ఈ ప్రాంతానికి చెందిన వృద్ధులు ఉంటున్నారు. ఇతర ప్రాంతాల్లోని ఆశ్రమాల్లో చాలా మంది వృద్ధులు ఆశ్రయం పొందుతున్నారు.

ఎందరికో ఆశ్రయమిస్తున్న రైల్వే స్టేషన్..

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా పొరుగు జిల్లాలకు చెందిన పలువురు వృద్ధులు కన్నబిడ్డల ఆదరణ లేకపోవడంతో ఆకలి తీర్చుకునేందుకు భిక్షాటన చేస్తున్నారు. కొందరు ఆత్మాభిమానం చంపుకోలేక ఎక్కడో ఓ చోటు వెదుక్కుని చావు ఎప్పుడు వస్తుందోనని ఎదురుచూస్తున్నారు. జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఇలాంటివారికి ఎందరికో ఆశ్రయమిస్తోంది. గతంలో స్టేషన్ ముందు ఉండే షెడ్డులో ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఆశ్రయం పొందేవారు. మరికొందరు ప్లాట్‌ఫాంలపై గడిపేవారు. స్టేషన్ పునరుద్ధరణ పనులతో అనాథలు, వృద్ధులు పగలు ఎక్కడెక్కడో తిరిగి రాత్రి దుకాణాలు మూసిన తర్వాత వాటి అరుగులపై సేదతీరుతున్నారు. ఎవరైనా దయతలచి నాలుగు మెతుకులు పెడితే తింటారు. లేదంటే పస్తులుంటారు. వృద్ధుల సంరక్షణ కోసం ఎన్నో చట్టాలున్నా.. ముసలి తల్లిదండ్రులకు మాత్రం తిప్పలు తప్పడం లేదు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే వారి విషయంలో చట్టాలను కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని వృద్ధుల సంఘాలు పేర్కొంటున్నాయి. అప్పుడే జీవిత చరమాంకంలో కాసింత గౌరవప్రదమైన జీవనం దక్కుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

కుట్టేస్తున్నాయి



విజృంభిస్తున్న దోమలు

- పెరుగుతున్న వ్యాధులు
- జిల్లాలో యాభై రోజుల్లో యాభై డెంగీ కేసులు
- నేడు ప్రపంచ దోమల దినం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దోమలు దండయాత్ర చేస్తుండడంతో జనం వ్యాధుల బారిన పడుతున్నారు. దీంతో ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. ప్రధానంగా డెంగీ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. బుధవారం ప్రపంచ దోమల దినం సందర్భంగా కథనం..

జిల్లాలో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రజలను కుడుతుండడంతో జ్వరాలతో బాధపడుతున్నారు. జిల్లాలో యాభై రోజుల్లో యాభై డెంగీ కేసులు నమోదయ్యాయి. జూలై మాసంలో 26 కేసులు నమోదవగా, ఈనెలలో ఇప్పటివరకు 24 కేసులు రికార్డయ్యాయి. అంటే రోజుకొకటి చొప్పున డెంగీ కేసు నమోదవుతోంది. రికార్డులకెక్కని కేసులు ఎన్నో ఉన్నాయి. టైఫాయిడ్ కేసులు లెక్కలేనన్ని నమోదవుతున్నాయి. ఇంటింటా జ్వర పీడితులే కనిపిస్తున్నారు. చాలామంది టైఫాయిడ్‌తో ఇబ్బంది పడుతున్నారు. కొందరు డెంగీ లక్షణాలు కనబడగానే చికిత్సలు పొంది బయటపడుతున్నా.. మరికొందరు ప్లేట్‌లెట్స్ పడిపోయి ఆస్పత్రుల పాలవుతున్నారు.

కాగితాల మీదే దోమల నివారణ చర్యలు..

దోమల నివారణకు ప్రభుత్వం తూతూమంత్రంగా చర్యలు తీసుకుంటోంది. పట్టణాలతో పాటు పల్లెల్లో దోమల నివారణకు చేపట్టాల్సిన చర్యలేవీ క్షేత్ర స్థాయిలో జరగడం లేదు. చాలా చోట్ల ఫాగింగ్ ఊసే లేదు. దీంతో దోమల వ్యాప్తి ఆగడం లేదు. దోమలు పెరిగినకొద్దీ వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఎవరికి వారుగా చైతన్యవంతులై దోమల నివారణకు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ఉత్తమం.

డ్రంకెన్ డ్రైవ్‌కు సమాజ సేవ శిక్ష

వినూత్న శిక్ష విధించిన కామారెడ్డి కోర్ట్

కామారెడ్డి టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి సామాజిక సేవను శిక్షగా విధించింది కామారెడ్డి కోర్టు. వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులకు చిక్కాడు. అతడిని పోలీసులు మంగళవారం కామారెడ్డి కోర్టులో హాజరు పరిచారు. సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ టి.చంద్రశేఖర్ నిందితుడికి వెయ్యి రూపాయల జరిమానాతో పాటు ఒక రోజు కమ్యూనిటీ సర్వీస్ చేయాలని శిక్ష విధించారు. 'నేను మద్యం సేవించి వాహనం నడిపినందుకు కోర్ట్ నాకు ఒక రోజు కమ్యూనిటీ సర్వీస్ శిక్ష విధించింది. మద్యం సేవించి వాహనం నడుప వద్దు' అనే ప్లకార్డును ప్రదర్శిస్తూ జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో నిల్చున్నాడు. ఇకపై మద్యం తాగి వాహనం నడపనని అతడు పేర్కొన్నాడు. ఈ వ్యక్తిని చూసైనా మద్యం తాగి వాహనాలు నడిపేవారిలో మార్పు వస్తుందేమో.



నిజాంసాగర్ చౌరస్తాలో ప్లకార్డు ప్రదర్శిస్తున్న వ్యక్తి

'యూరియా కొరత రాకుండా చూడండి'

నిజాంసాగర్: యూరియా కొరత రాకుండా వ్యవసాయశాఖ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం నర్సింగ్‌రావ్‌పల్లి చౌరస్తా వద్దనున్న అచ్చంపేట సొసైటీ గోదామును ఆయన తనిఖీ చేశారు. నిల్వ ఉన్న యూరియా బస్తాలను పరిశీలించారు. పంటలు సాగు చేసిన రైతులకు మాత్రమే యూరియా విక్రయించాలన్నారు. రైతుల ముసుగులో యూరియా బస్తాలను ప్రైవేట్‌కు తరలిస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, డీఏవో మోహన్‌రెడ్డి, ఏవో అమర్‌ప్రసాద్, సొసైటీ చైర్మన్ నర్సింహారెడ్డి, సీఈవో సంగమేశ్వర్ గౌడ్ తదితరులున్నారు.



యూరియా నిల్వలను పరిశీలిస్తున్న కలెక్టర్

తరగతి గదులకు నిధులు మంజూరు

కామారెడ్డి టౌన్: నిజాంసాగర్ మండలం అచ్చంపేట ప్రాథమిక పాఠశాలలో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా మంజూరైన అదనపు తరగతుల నిర్మాణం అసంపూర్తి ఉంది. దీంతో 105 మంది విద్యార్థులు ఆరు బయట చదువుకోవాల్సి వస్తోంది. ఈ సమస్య కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ దృష్టికి రావడంతో ఆయన వెంటనే స్పందించారు. విద్యార్థుల అవసరం దృష్ట్యా కనీసం రెండు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేయడానికి రూ. 4 లక్షల నిధులు మంజూరు చేశారు. పనులు త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చూడాలని డీఈవో రాజును ఆదేశించారు.

'పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం'


నిజాంసాగర్ : నిజాంసాగర్ ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడం కోసం ప్రభుత్వం రూ. 10 కోట్లు మంజూరు చేసిందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయితో కలిసి నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించారు. గేట్ల నిర్వహణ, వరద నీటి మళ్లింపు, ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లోల వివరాలను జిల్లా నీటిపారుదల శాఖ సీఈ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. గోల్ బంగ్లా వద్ద పర్యాటక అభివృద్ధి పనుల గురించి తెలుసుకున్నారు. ముంపు గ్రామాలతో పాటు పురాతన ఇళ్లలో నివసిస్తున్న వారు పునరావాస కేంద్రాల్లో ఉండాలని కలెక్టర్ సూచించారు. వారి వెంట మండల ప్రత్యేకాధికారి రమాదేవి, ఈఈ సోలోమాన్, తహసీల్దార్ భిక్షపతి, ఏఈలు శివప్రసాద్, సాకేత్, ఎంపీడీవో గంగాధర్, ఎస్సై శివకుమార్ తదితరులున్నారు.



ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి

కొనసాగుతున్న నీటి విడుదల

ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో వస్తుండడంతో నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. మంగళవారం సాయంత్రానికి నిజాంసాగర్‌లోకి 80 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. దీంతో 16 గేట్ల ద్వారా 88 వేల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1,403. 67 అడుగుల (15.902 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.



ప్రాజెక్టు ద్వారా విడుదలవుతున్న జలాలు



నిజాంసాగర్ ప్రాజెక్టును తిలకించడానికి వచ్చిన పర్యాటకులు

ట్రయల్ రన్ సక్సెస్

నిజాంసాగర్: ఆరేడ్ గ్రామ పరిసరాల్లో ఉన్న నిజాంసాగర్ ప్రాజెక్టు 20 వరద గేట్లకు మంగళవారం ట్రయల్ రన్ నిర్వహించారు. ఒక్కో గేటును 5 మీటర్ల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ట్రయల్‌రన్‌ను జిల్లా నీటిపారుదల శాఖ సీఈ శ్రీనివాస్, ఈఈ సోలోమాన్, ఏఈలు శివప్రసాద్, సాకేత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కాశీనాథ్ పర్యవేక్షించారు. ఈ 20 గేట్లను ఎత్తడం 36 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి. అన్ని గేట్లు సక్రమంగా లేవడంతో నీటిపారుదల శాఖ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

తరలివచ్చిన జనం..

నిజాంసాగర్ ప్రాజెక్టు 20 వరద గేట్లను ఎత్తి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రాజెక్టు అందాలను తిలకించడానికి జనం తరలివచ్చారు. ఈ గేట్లను 36 ఏళ్ల తర్వాత ఎత్తడం గమనార్హం. వేలాది మంది పర్యాటకులు తరలిరావడంతో ప్రాజెక్టు జనకళను సంతరించుకుంది.



20 గేట్ల నుంచి విడుదలవుతున్న వరద నీరు

కల్యాణినుంచి కొనసాగుతున్న నీటి విడుదల

ఎల్లారెడ్డి: తిమ్మారెడ్డి శివారులోని కల్యాణి ప్రాజెక్టునుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి 300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండడంతో ఐదు గేట్ల ద్వారా ఆ నీటిని మంజీర నదిలోకి వదులుతున్నామని అధికారులు తెలిపారు.



నగరంలో ఏటీఎం చోరీకి యత్నం

- బ్యాంక్ మెయిన్ బ్రాంచ్‌కు అందిన సమాచారం
- అప్రమత్తమై, ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు
- పరారైన దుండగులు

ఖలీల్‌వాడి (నిజామాబాద్ అర్బన్) : మారుతి వ్యాన్‌లో వచ్చిన దుండగులు ముసుగులు ధరించి.. గ్యాస్ కట్టర్‌ను ఉపయోగించి ఏటీఎం యంత్రాన్ని ధ్వంసం చేశారు. సీసీ కెమెరాలకు చిక్కకుండా ముసుగులు ధరించారు. అదే సమయంలో పోలీస్ పెట్రోలింగ్ వాహనం రావడంతో వ్యాన్‌లో పరారయ్యారు. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని చంద్రశేఖర్ కాలనీ చౌరస్తాలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మహారాష్ట్రలో రిజిస్ట్రేషన్ అయిన మారుతి వ్యాన్‌లో వచ్చిన దండగులు ముసుగులు ధరించి ఏటీఎంలోకి ప్రవేశించారు. తమ వెంట తీసుకొచ్చిన గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను ధ్వంసం చేశారు. నగదు తీసేందుకు యత్నిస్తున్న సమయంలోనే పోలీసు పెట్రోలింగ్ వాహనం రావడంతో వ్యాన్‌లో పరారయ్యారు. బాసర వైపు పారిపోతుండగా అప్రమత్తమైన పెట్రోలింగ్ సిబ్బంది దుండగుల వాహనాన్ని వెంబడిస్తూనే అన్ని పోలీస్‌స్టేషన్‌లకు సమాచారం అందించారు. తప్పించుకునే మార్గం లేకపోవడంతో నవీపేట మండలం పొల్గ వద్ద మారుతి వ్యాన్‌ను వదిలేసి పారిపోయారు. చుట్టు పక్కల ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని పోలీసులు ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు.


ముంబై మెయిన్ బ్రాంచ్‌కు మెస్సేజ్

ఏటీఎంలో దుండగులు చోరీకి యత్నిస్తున్న సమయంలో ముంబైలోని మెయిన్ బ్రాంచ్‌కు మెస్సేజ్ వెళ్లడంతో అక్కడి సిబ్బంది నిజామాబాద్ పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. వెంటనే మూడో టౌన్ పోలీస్ స్టేషన్ పెట్రోలింగ్ వాహనం ఏటీఎం వద్దకు చేరుకోవడంతో దుండగులు పరారయ్యారు. ఏటీఎం నుంచి నగదు పోలేదని ఎస్సై హరిబాబు తెలిపారు.

ఘటనా స్థలం పరిశీలన

ఘటనాస్థలాన్ని సీపీ పోతరాజు సాయిచైతన్య పరిశీలించారు. మూడవటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రశేఖర్ కాలనీలో ఎస్‌బీఐ బ్యాంక్ ఏటీఎంను సీపీ పోతరాజు సాయిచైతన్య పరిశీలించారు. ఎస్సై హరిబాబు, సీఐ శ్రీనివాస్ రాజుకు పలు సూచనలు చేశారు. కేసు విచారణ చేయాలని క్లూస్ టీం, సీసీఎస్ టీం అధికారులను ఆదేశించారు.

పొంచి ఉన్న ప్రమాదం



కలెక్టరేట్‌లో స్విచ్ బోర్డు వద్ద నీటి తడి

కలెక్టరేట్‌లోని టాయ్‌లెట్స్ వద్ద పైకప్పు లీకేజీలతో గోడకు తేమ వస్తోంది. విద్యుత్ ప్రసారానికి సంబంధించిన స్విచ్ బోర్డ్ సైతం తడిసింది. ఎవరైనా స్విచ్ వేస్తే షాక్ తగిలే అవకాశాలున్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

'నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలి'

కామారెడ్డి క్రైం: గణేశ్ నవరాత్రులు, శోభాయాత్రలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ రాజేశ్ చంద్ర మంగళవారం ఒక ప్రకట న ద్వారా సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు శాఖ సూచించిన విధంగా ఆన్‌లైన్ ద్వారా వివరా లు సమర్పించి అనుమతులు తీసుకోవాలని పేర్కొన్నారు. మండపాల వద్ద భద్రత, ని యమ నిబంధనలను పాటించాలని సూచించారు. ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో నిబంధనలకు లోబడి కార్యక్రమాలు జరపాలని పేర్కొన్నారు.

మండపాల్లో ఏదైనా బ్యాగులు, ప్లాస్టిక్ కవర్లు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే డయల్ 100కు గా నీ, స్థానిక పోలీసులకు గానీ ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలి

- రాజ్యాంగాన్ని మార్చే కుట్ర మానుకోవాలి
- ఇచ్చిన హామీలన్నీ ప్రభుత్వం నెరవేర్చాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

కామారెడ్డి టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం అన్ని వర్గాల ప్రజలు సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పేర్కొన్నారు. పార్టీ మాజీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి జయంతి సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం భవనంలో 'రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ బిల్లును అడ్డుకుంటోందన్నారు. సమాన అవకాశాలు కల్పించాలని చెబుతున్న రాజ్యాంగాన్ని మార్చే కుట్ర జరుగుతోందన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి ఇప్పటివరకు పంటలకు గిట్టుబాటు ధర లేక దేశవ్యాప్తంగా లక్షకుపైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. కార్పొరేట్ వ్యవస్థలకు ప్రధాని మోదీ తొత్తుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. దోపిడి రహిత సమాజం కోసం సీతారాం ఏచూరి ఎంతగానో కృషి చేశారంటూ ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు వెంకట్రాములు, వెంకట్‌గౌడ్, మోతీరాం నాయక్, నర్సింలు, రేణుక, అరుణ్, అజయ్, రవీందర్, సురేష్, రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

క్లుప్తంగా

నాణ్యమైన భోజనం అందించాలి



మాచారెడ్డి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కామారెడ్డి ఆర్డీవో వీణ సూచించారు. మంగళవారం ఘన్‌పూర్(ఎం) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ సరళ, ఎంపీడీవో గోపిబాబు, ఎంఈవో దేవేందర్‌రావ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

చెరువు అలుగు కట్టపై పోసిన మట్టిని తొలగించాలి



ఎల్లారెడ్డిరూరల్: మహ్మద్‌నగర్ మండలంలోని నర్వ చెరువు కట్టపై మట్టి పోసి అలుగు ఎత్తు పెంచడంతో వెంకటాపూర్ గ్రామ శివారు పంటలు నీట మునుగుతున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని చెరువు కట్టపై పోసిన మట్టిని తొలగించేలా తగిన చర్యలు తీసుకోవాలని వెంకటాపూర్ గ్రామస్తులు కోరారు. ఈమేరకు మంగళవారం తహసీల్దార్ ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. గ్రామస్తులు మల్లేష్, సాయిలు తదితరులున్నారు.

ఆర్ట్స్ కళాశాలలో సామాజిక మానవహారం



కామారెడ్డి అర్బన్: జాతీయ సామాజిక పని వారోత్సవాల సందర్భంగా స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పీజీ సోషల్ వర్క్ విద్యార్థులు మంగళవారం మానవహారం ఏర్పాటు చేశారు. సోషల్ వర్క్ స్టడీస్ చైతన్యంతో సామాజిక సేవా దృక్పథం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవాడుతాయని ప్రిన్సిపల్ కె.విజయ్ కుమార్ అన్నారు. కార్యక్రమంలో సోషల్‌వర్క్ విభాగాధిపతి జి.శ్రీనివాస్‌రావు, అధ్యాపకులు పీబీ సత్యం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందం కావొద్దు విషాదం!

- వినాయక ఉత్సవాల్లో జాగ్రత్తలు అవసరం
- చిన్న చిన్న పొరపాట్లే ప్రాణాలు తీస్తాయి
- శోభాయాత్ర, నిమజ్జన సమయంలో మరింత జాగ్రత్త అవసరం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: వినాయక చవితి వస్తుందంటే అందరిలోనూ ఆనందం. నెల రోజుల ముందు నుంచే ఏర్పాట్లు మొదలుపెడతారు. అందరి కన్నా ఎక్కువ ఎత్తులో ఉన్న విగ్రహం కొనాలని ఎక్కడెక్కడికో వెళ్లి తీసుకొస్తారు. మండపాలను అందంగా తీర్చిదిద్దడానికీ పోటీ పడతారు. తొమ్మిది రోజుల పాటు పూజలు, ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు. చివరకు నిమజ్జన కార్యక్రమంలో నృత్యాలు చేస్తూ పూర్తిచేస్తారు. అయితే ఆనందంలో చేసే నిర్లక్ష్యం నిండు ప్రాణాలను బలి తీసుకుంటోంది. వినాయక చవితి ఉత్సవాలకు ముందుగానే విగ్రహాలను కొనుగోలు చేసి తీసుకువెళుతుండగా ప్రమాదాలు జరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఆర్మూర్ నుంచి సిరిసిల్లాకు కామారెడ్డి మీదుగా మంగళవారం ఉదయం ఎత్తైన విగ్రహాన్ని తరలిస్తుండగా విద్యుత్తు వైర్లు తగిలి ఓ యువకుడు తన పుట్టిన రోజునే ప్రాణాలు కోల్పోయిన ఘటన అందరినీ కలిచివేసింది. గతంలోనూ అనేక అనుభవాలున్నాయి. అయినా విగ్రహాలను తరలించే సమయంలో, శోభాయాత్ర ఊరేగింపులోనూ జాగ్రత్తలు తీసుకోక ప్రాణాలు పోతున్న ఘటనలు ప్రతి ఏడాది జరుగుతున్నాయి.



విగ్రహం తీసుకెళ్తుండగా జరిగిన విద్యుత్ ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ శ్రావణ్, డీఈ కళ్యాణ్

చెరువుల్లో నిమజ్జనం చేసేటపుడు..

భారీ విగ్రహాలను నిమజ్జనం చేసే క్రమంలో అవి ఎంతకూ మునగడం లేదని లోతుల్లోకి తీసుకెళ్తుంటారు. ఒక్కోసారి విగ్రహం అదుపు తప్పి వారిపై పడుతుంది. దీంతో ప్రాణాలు కోల్పోయే పరిస్థితి తలెత్తుతోంది. జిల్లాలో ప్రతి ఏడాది ఒకరిద్దరు నిమజ్జనం చేసే ప్రయత్నంలో ప్రాణాలు కోల్పోతున్నారు. ఈత వచ్చినా ఒక్కోసారి పైన విగ్రహం పడితే దాని కింద కూరుకుపోయి చనిపోతారు.

గుండెను పిండేసే డీజేలు..

వినాయక నిమజ్జన ఊరేగింపులో డీజేలు వాడడం, భారీ సౌండ్‌తో గుండె తట్టుకోలేక ప్రాణాలు పోయే పరిస్థితులున్నాయి. రెండేళ్ల నాడు రామారెడ్డి మండలం రెడ్డిపేటలో డీజే సౌండ్‌తో ఓ యువకుడు గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోయాడు. మృతుని కుటుంబానికి తీరని వేదన మిగిలింది. తమతో కలిసి ఉన్న స్నేహితుడి ప్రాణాలు పోవడంతో మిత్రులంతా ఆవేదనకు గురయ్యారు. వారికి జీవితాంతం ఒక బాధైతే మిగిలింది. జిల్లా కేంద్రంలో డీజేలకు అనుమతులు ఇవ్వడం లేదు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో డీజేలు వాడుతున్నారు. డీజే సౌండ్‌తో అన్ని వయసుల వారికి ప్రమాదమన్న విషయాన్ని గుర్తించాలి.

ప్రాణం తీసే కరెంటు..

వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన మండపాల వద్ద విద్యుత్ సమస్యలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే విగ్రహాలను ప్రతిష్ఠించడానికి తరలించే సమయంలో, నిమజ్జనం వేళ శోభాయాత్రలో వెళ్తున్నపుడు కరెంటు వైర్లు తగిలి ఇనుప రాడ్లతో వాహనాలపై కూర్చున్నవారు షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. ఉత్సవాల సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ కొన్ని చోట్ల వినాయక విగ్రహాలు మరీ ఎత్తుగా ఉండి, తరలించేటపుడు చూసుకోక ఇబ్బందులు పడుతున్నారు.

సమాచారం ఇవ్వాలి

వినాయక విగ్రహాలను తరలించే సమయంలో సమాచారమిస్తే మా సిబ్బంది సహకరిస్తారు. వైర్లను స్వయంగా తొలగించే ప్రయత్నం చేస్తే ప్రాణాలకు ప్రమాదం కలుగుతుంది. ఆరేపల్లి వద్ద జరిగిన ఘటన స్థలాన్ని పరిశీలించాం. ఎత్తైన విగ్రహాన్ని తీసుకువెళ్లేటపుడు సమాచారం ఇవ్వాలి. వినాయక మండపాల వద్ద విద్యుత్తు కనెక్షన్ల కోసం, నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తున్నాం. మా దృష్టికి తీసుకురాకుండా వైర్లను తొలగించొద్దు.

– శ్రావణ్‌కుమార్, ఎస్ఈ, విద్యుత్ శాఖ

విత్తనక్షేత్రంలో వానాకాలం సాగులేనట్లేనా..?

- పంటలసాగు కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిన క్షేత్రఅధికారులు
- ఉన్నతాధికారుల నుంచి నేటికీ రాని అనుమతులు
- బీడుగా మిగిలిన విత్తన క్షేత్ర భూములు



వానాకాలం పంటలసాగుకు నోచుకోని విత్తనక్షేత్ర భూమి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద విత్తనక్షేత్రంలో ఈ యేడు వానాకాలం పంటలసాగుపై నీలినీడలు అలుముకున్నాయి. ఈ యేడు విత్తనక్షేత్రంలో వానాకాలం పంటల సాగు లేనట్లేనా అంటే ప్రస్తుతం క్షేత్రంలో నెలకొన్న పరిస్థితులు అందుకు అవుననే సమాధానం ఇస్తున్నాయి. సగం సీజన్ పూర్తయినా ఇప్పటివరకు క్షేత్రభూముల్లో పంటలసాగుకు సంబంధించి ఎలాంటి పనులు ప్రారంభమవ్వలేదు. వందల ఎకరాల సాగుభూమిని కలిగి ఉన్న మాల్తుమ్మెద విత్తనక్షేత్రంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా వానాకాలం పంటల సాగు పనులు నేటికీ ప్రారంభం కాలేదు. క్షేత్రభూముల్లో పంటలసాగు కోసం ప్రతియేడులాగే ఈ యేడు కూడ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. ఇప్పటికీ రెండు మార్లు ప్రతిపాదనలు పంపినప్పటికీ నేటికీ ఉన్నతాధికారుల నుంచి పంటలసాగు కోసం ఎలాంటి అనుమతులు రాలేదని క్షేత్ర అధికారులు తెలిపారు. ఈ యేడు వానాకాలంలో విత్తనక్షేత్రంలో 50 ఎకరాల్లో వరి, మరో 80 ఎకరాల్లో జీలుగ పంటలను సాగు చేయాలని క్షేత్రఅధికారులు కమిషనర్ కార్యాలయానికి రెండు మార్లు ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. కాని పంటలసాగుపై వారి నుంచి ఎలాంటి అనుమతులు రాలేదని క్షేత్రఅధికారులు పేర్కొంటున్నారు. ఫలితంగా విత్తనక్షేత్ర భూముల్లో వానాకాలం పంటలసాగుకు సంబంధించి నేటికీ ఎలాంటి పనులు ప్రారంభంకాలేదు. వరిసాగు కోసం కనీసం నారుమడిని సిద్ధం చేయలేదు.

ప్రతియేడు ఇదే తీరు..

వందల ఎకరాల సాగుభూమిని కలిగి ఒకప్పుడు మేలు రకాల నూతన వరి వంగడాల ఉత్పత్తితో తెలంగాణ వ్యాప్తంగా పేరుగాంచిన నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద విత్తనోత్పత్తిక్షేత్రంలో అధికారుల తీరుతో నిర్లక్ష్యపునీడలు అలుముకున్నాయి. సాధారణంగా రైతులు వానాకాలం పంటలసాగులో భాగంగా చాలారోజులక్రితమే వరినాట్లు పూర్తిచేశారు. ఇతర రైతులకు ఆదర్శంగా ఉండాల్సిన విత్తనోత్పత్తిక్షేత్రంలో నేటికీ వానాకలం పంటలసాగు పనులు ప్రారంభంకాలేదు. పంటలసాగుకు ఉన్నతాధికారుల నుండి ఎలాంటి అనుమతులు రాకపోవడంతో ఈ యేడు క్షేత్రభూములు పంటలసాగుకు నోచుకోక బీడుగానే మిగలనున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

నేడు గురుకులాల్లో స్పాట్ అడ్మిషన్స్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఐదో తరగతి, ఇంటర్ (ప్రథమ సంవత్సరం) లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి బుధవారం స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కో ఆర్డినేటర్ మాధవీలత ఒక ప్రకటనలో తెలిపా రు. గతేడాది ఎస్సెస్సీ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి అర్హులని తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశాని కి గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాలయాల్లో 4వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఈ విద్యాసంవత్సరంలో వీటీజీసెట్ ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థులకు మెరిట్ ప్రాతిపాదికన అడ్మిషన్లలో ప్రా ధాన్యత ఉంటుందన్నారు. ఏదైనా ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థలలో ఇప్పటికే సీటు పొందిన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్స్‌కు అనర్హులన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థుల తల్లిదండ్రుల సంవత్సరాదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50లక్షలకు మించకుండా, పట్టణ ప్రాంతాల వారికి రూ.2లక్షలకు మించకుండా ఉండాలన్నారు. షెడ్యూల్ కులాల విద్యార్థులు, అనాథ విద్యార్థులకు ని యమనిబంధనలకు లోబడి ప్రాధాన్యత ఇ వ్వబడుతుందన్నారు. అర్హత, ఆసక్తి గల వి ద్యార్థులు నేడు డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి)లోని తెలంగాణ సాంఘిక సంక్షే మ గురుకులంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు.

పాత జ్ఞాపకాలను పదిలం చేసేదే ఫొటోగ్రఫీ



ఫొటోగ్రాఫర్‌ను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ చందర్ నాయక్, తదితరులు

కామారెడ్డి అర్బన్: ఫొటోగ్రఫీ అనేది జీవితాన్ని చిత్రీకరించే సృజనాత్మక కళ అని, పాత జ్ఞాపకాలను పదిలం చేస్తుందని అదనపు కలెక్టర్ చందర్ అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఫొటోగ్రాఫర్లకు సన్మానం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ ఫొటోగ్రాఫర్లను సన్మానించి మాట్లాడారు. ఫొటో జ్ఞాపకాలపై రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ముస్కు జైపాల్‌రెడ్డి మాట్లాడారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు యాచం శంకర్, కార్యదర్శి సబ్బని కృష్ణహరి, ప్రతినిధులు పాల్గొన్నారు.

బాన్సువాడ : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మంగళవారం బాన్సువాడలో ఘనంగా నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీనియర్ ఫొటోగ్రాఫర్ దండు సంజీవరావును సన్మానించారు. ఫొటోగ్రాఫర్లు గంగాధర్ యాదవ్, గోవర్ధన్, శేఖర్, వెంకటేష్, దత్తు, ఫయాజ్ తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో ఫొటోగ్రాఫర్లు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఫొటోగ్రాఫర్లు కృష్ణ, విఠల్, భూపాల్, కార్తిక్ తదితరులున్నారు.

యువతకు హెచ్ఐవీపై అవగాహన అవసరం



భిక్కనూరు: యువత హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ ప్రోగ్రాం అధికారి రాధిక పేర్కొన్నారు. మంగళవారం తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో 5కే రెడ్ రన్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, సోషల్ వర్క్ డిపార్ట్‌మెంట్ హెడ్ అంజయ్య, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ ప్రోగ్రాం మేనేజర్ చల్లా సుధాకర్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు జ్యోతి, రాణి, దివ్య, రుచిత, బాలకృష్ణ, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి జన కళ

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు జలకళతోపాటు జనకళ సంతరించుకుంటుంది. వరద గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండటంతో ప్రాజెక్ట్ సందర్శనకు వేల సంఖ్యలో పర్యాటకులు తరలివస్తున్నారు. ప్రాజెక్ట్ అందాలను, గలగల పారే గోదావరిని తిలకిస్తు ఆనందంగా గడుపుతున్నారు. కొందరు ఆహారాన్ని తీసుకు వచ్చి సహపంక్తి భోజనాలను చేస్తు ఉల్లాసంగా గడిపారు. ఆనకట్టపై ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ ఎంజాయ్ చేశారు. ప్రాజెక్ట్ వద్ద కనీస వసతులు లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు.



ప్రాజెక్ట్ ఆనకట్టపై పర్యాటకుల సందడి

బోధన్‌లో కలకలం రేపిన రేసింగ్ పావురం



బోధన్‌రూరల్ : నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలో కోడింగ్ స్టిక్కర్‌తో ఉన్న పావురం కలకలం రేపింది. మండలంలోని భవానీపేట్ గ్రామంలో ఓ బాలుడు ఆడుకుంటుండగా పావురం దొరికింది. ఆ పావురం కాలికి, రెక్కలకు కోడింగ్ నెంబర్‌లతో ఉన్న స్టిక్కర్‌లు ఉన్నాయి. దీంతో ఆ పావురం గూఢచారి పావురం అంటూ ప్రచారం జరిగింది. గ్రామస్తులు కొందరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి అక్కడికి చేరుకుని పావురాన్ని స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్ తీసుకొచ్చారు. ఈ పావురం రేసింగ్ గేమ్‌కు సంబంధించినదని ఎస్సై తెలిపారు. పావురాన్ని పరిశీలించి వదిలేసినట్లు చెప్పారు. ఎటువంటి కేసు నమోదు చెయ్యలేదన్నారు. ఈ పావురం ఘటన మంగళవారం సోషల్ మీడియా వైరల్‌గా మారింది.

చెట్టును ఢీకొని డీసీఎం బోల్తా



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని సుల్తాన్‌నగర్ గ్రామ శివారులో మంగళవారం వేకువజామున డీసీఎం వాహనం చెట్టును ఢీకొని బోల్తాపడింది. ఎల్లారెడ్డి ప్రాంతం నుంచి పిట్లం వైపు వెళ్తున్న డీసీఎం ప్రధాన రోడ్డుపై ఉన్న గుంతను తప్పించబోయి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

టీఎల్‌ఎం ద్వారా సులభంగా బోధించవచ్చు



రాజంపేట: బోధన అభ్యాస సామగ్రి(టీఎల్‌ఎం) ద్వారా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించవచ్చని మండల విద్యాధికారి పూర్ణ చంద్ర రావ్ అన్నారు. మంగళవారం రాజంపేట బాలికల ఉన్నత పాఠశాలలో టీఎల్‌ఎమ్ మేళా నిర్వహించారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి తెలుగు, ఇంగ్లీష్, గణితం, పరిసరాల విజ్ఞానం అంశాల నుంచి ఉపాధ్యాయులు టీఎల్‌ఎంను తయారు చేసి ప్రదర్శించారు. బోధన అభ్యాస సామాగ్రి మేళాను స్థానిక తహసీల్దార్ జానకి సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు. హెచ్‌ఎంలు విజయలక్ష్మి, ఈశ్వరయ్య, రమేష్, రెడ్య, కిషన్, కరుణశ్రీ, విజయలక్ష్మి, రీసోర్స్ పర్సన్‌లు ముదాం స్వామి, శ్రీధర్ గౌడ్, రాజేందర్, నిరూపమా రాణి, సీఆర్పీలు లింగం, సాయిరెడ్డి, రమేష్, సూర్యా పాల్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆశ కార్యకర్త ఆత్మహత్య

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని పద్మాజీవాడిలో ఓ ఆశ కార్యకర్త ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. వివరాలు ఇలా.. పద్మాజీవాడికి చెందిన మ్యాదరి అంబిక(40) గతకొన్ని రోజులుగా ఆశ కార్యకర్తగా విధులు నిర్వహిస్తోంది. కొన్నేళ్ల క్రితమే భర్త మరణించాడు. కుమార్తెకు ఇటీవల వివాహం జరిపించింది. దీంతో అప్పులు పెరిగిపోవడంతోపాటు, ఒంటరిగా జీవిస్తుండటంతో జీవితంపై విరక్తి చెందింది. ఈక్రమంలో సోమవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్సై తెలిపారు.

సైబర్‌క్రైమ్‌లో డబ్బుల రీఫండ్

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి సైబర్ మోసానికి గురై, డబ్బులు పోగొట్టుకోగా పోలీసులు రికవరీ చేశారు. కోటగిరి ఎస్సై సునీల్ తెలిపిన వివరాలు ఇలా.. కోటగిరి గ్రామానికి చెందిన ఎజాస్ అహ్మద్ ఖురేషి అనే వ్యక్తి వాట్సప్‌కు 13 ఏప్రిల్ 2025 నాడు అనుమానాస్పద లింక్ మెసేజ్ రాగా ఓపెన్ చేశాడు. దీంతో సైబర్ నేరగాళ్లు అతని బ్యాంక్ అకౌంట్ నుంచి కొన్ని డబ్బులు దోచేశారు. వెంటనే బాధితుడు కోటగిరి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయగా, వారు సైబర్ క్రైమ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి బాధితుడికి రూ.5వేలు రిఫండ్ చేయించారు.

వృద్ధురాలి హత్యకేసులో నిందితుడికి జీవిత ఖైదు

నిజామాబాద్ లీగల్/కామారెడ్డి క్రైం: ఆభరణాల కోసం ఓ వృద్ధురాలిని హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ నిజామాబాద్ కోర్టు మంగళవారం తీర్పు వెల్లడించింది. వివరాలు ఇలాలా.. కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలోని శివాజీనగర్‌కు చెందిన గుడిలింగం పండరి అనే యువకుడు మద్యానికి బానిసయ్యాడు. సులువుగా డబ్బు సంపాదన కోసం దొంగతనాలకు అలవాడు పడ్డాడు. ఈక్రమంలో గ్రామంలోని గోనె కాశవ్వ (58) అనే వృద్ధురాలి ఆభరణాలను దొంగిలించాలనుకున్నాడు. 29 సెప్టెంబర్, 2024న కాశవ్వ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఆమె తలపై రోకలి దుడ్డుతో కొట్టి హత్యచేసి, ఆమె మెడలో ఉన్న గుండ్లు, చెవులకు ఉన్న నగలను దొంగిలించాడు. మృతురాలి కుమారుడు బాబయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపారు. నిందితుడు లింగంను అప్పట్లోనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన నిజామాబాద్ రెండవ అదనపు జిల్లా సెషన్స్ (ఎస్సీ, ఎస్టీ) కోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్ నిందితుడికి హత్యా నేరానికి గాను జీవిత ఖైదు, దొంగతనం నేరానికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, ఎస్సీ మహిళను చంపినందుకు మరో ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.4వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

బైక్ చోరీ కేసులో ఇద్దరికి 9 నెలల జైలు

ఎల్లారెడ్డి: బైక్ చోరీ కేసులో ఇద్దరికి 9నెలల జైలు శిక్ష విధిస్తూ ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు మంగళవారం తీర్పు వెల్లడించారు. వివరాలు ఇలా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లాకు చెందిన బత్తుల హరిక్రిష్ణ ఎల్లారెడ్డి పట్టణంలో ఉంటూ మేస్త్రీ పనులు చేస్తున్నాడు. 2024 డిసెంబర్ 11న అతడి బైక్ ఇంటి ముందు నుంచి చోరీకి గురైంది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులుగా ఎర్ర అశోక్, దొడ్ల గోపాల్‌గా గుర్తించారు. కోర్టులో విచారణ జరుగగా ఎల్లారెడి కోర్టు జడ్జి సుష్మ నిందితులకు 9 నెలలు జైలు శిక్ష, రూ. వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం



సిరికొండ: మండలంలోని కొండూర్ గ్రామంలో సుంకెట విజయకు చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైనట్లు తహసీల్దార్ రవీందర్‌రావు మంగళవారం తెలిపారు. అగ్ని ప్రమాదంలో ఇంట్లో ఉన్న నిత్యావసర వస్తువులు, బట్టలు, టీవీ, ఫ్రిజ్, సెల్‌ఫోన్లు, బియ్యం, నగదు, బంగారు ఆభరణాలు పూర్తిగా కాలిపోయినట్లు తెలిపారు. ప్రమాదంలో సుమారు రూ.4లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు.

సీపీఎస్ అంతం.. పీఆర్‌టీయూ పంతం



బాన్సువాడలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కుషాల్



తాడ్వాయిలో..



నస్రుల్లాబాద్‌లో..



గోపాల్‌పేట హైస్కూల్‌లో ..



రామారెడ్డిలో..

సాక్షి నెట్‌వర్క్: సీపీఎస్ అంతం పీఆర్‌టీయూ పంతమని పీఆర్‌టీయూ నేతలు అన్నారు. మంగళవారం జిల్లాలోని రామారెడ్డి, తాడ్వాయి, బాన్సువాడ, నస్రుల్లాబాద్, నాగిరెడ్డిపేట మండలాల పరిధిలో పీఆర్‌టీయూ మహాధర్నా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. సెప్టెంబర్ 1న రాష్ట్ర శాఖ పిలుపుమేరకు చేపట్టబోయే ఒక రోజు మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు నిరసన కార్యక్రమాలు జరుగుతామని వ్యాఖ్యానించారు.

దారిదోపిడీ కేసులో భార్యాభర్తల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేష్ చంద్ర

కామారెడ్డి క్రైం: లిఫ్ట్ అడిగి దారిదోపిడీలకు పాల్పడుతున్న నిందితులను కామారెడ్డి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాజేష్ చంద్ర వివరాలు వెల్లడించారు. రాజంపేట మండలం బస్వన్నపల్లి గ్రామానికి చెందిన పెద్దల రాజు అనే వ్యక్తి కామారెడ్డిలోని ఓ హోటల్‌లో పని చేస్తున్నాడు. ఈ నెల 17న సాయంత్రం అతడు విధులు ముగించుకుని ఇంటికి తన బైక్‌పై బయలుదేరాడు. బస్టాండ్ ప్రాంతంలో ఓ గుర్తుతెలియని మహిళ లిఫ్ట్ అడగడంతో రాజు లిఫ్ట్ ఇచ్చాడు. హైదరాబాద్‌లోని ఈఎస్ఆర్ గార్డెన్ వరకు వెళ్లగానే మరో బైక్‌పై గుర్తుతెలియని వ్యక్తి వారిని అడ్డుకున్నాడు. సదరు గుర్తుతెలియని వ్యక్తి, మహిళ ఇద్దరూ కలిసి రాజుపై దాడి చేసి అతని వద్దనున్న రూ.2 వేలు నగదు, సెల్‌ఫోన్ లాక్కుని పరారయ్యారు. రాజు ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితులను జిల్లా కేంద్రంలో నివాసం ఉంటున్న బైండ్ల లక్ష్మీ, ఆమె భర్త రాయపాని రవికుమార్‌గా గుర్తించారు. వారిని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. తెలిపారు. నిందితులు మాటల్లో పెట్టి లిఫ్ట్ ఇవ్వాలని అడిగి, గ్రామ శివారు ప్రాంతంలోకి వెళ్లగానే దాడి చేసి దోచేస్తారని పేర్కొన్నారు. ఇలాంటి వ్యక్తుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కేసును చేధించిన పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరి, సిబ్బందిని అభినందించారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



నిందితుడిని చూపుతున్న పోలీసులు

ఖలీల్‌వాడి: నగరంలోని సారంగపూర్‌లోని పెట్రోల్ బంక్ వద్ద గంజాయిని ఆటోలో తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో స్వప్న తెలిపారు. వివరాలు ఇలా.. నగరంలోని సారంగపూర్‌కు చెందిన సయ్యద్ వాసీం చిన్న ప్యాకెట్లను ఏర్పాటు చేసుకొని గంజాయి అమ్మకాలు సాగిస్తున్నట్లు తెలిపారు. పక్కా సమాచారం మేరకు సారంగపూర్ పెట్రోల్ బంక్ వద్ద ఆటోను ఆపి తనిఖీలు నిర్వహించగా వాసీం వద్ద 100 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అతడి సెల్‌ఫోన్‌ను, ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సిబ్బంది రామ్‌కుమార్, హమీద్, విష్ణు, అవినాష్, భోజన్న ఉన్నారు.

23న శనేశ్వరుడికి అమావాస్య తైలాభిషేకం

కామారెడ్డి అర్బన్: స్థానిక శని శింగనపురం శనేశ్వరస్వామికి ఈనెల 23న పొలాల అమావాస్య సందర్భంగా తెల్లవారుజామున 5 గంటల నుంచి తైలాభిషేకం, సాయంత్రం దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. శని బాధలు తొలిగించుకోవడానికి భక్తులు ఈ అవకాశం వినియోగించుకోవాలని కోరారు.

రైతులందరూ సంఘటితంగా ఉండాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): రైతులందరూ సంఘటితంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని భారతీయ కిసాన్ సంఘ్(బీకేఎస్) కమిటీ జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి అన్నారు. ఎర్రాపహాడ్‌లోగల రెడ్డి సంఘం భవనంలో మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతిలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో రైతులకు ఏ సమస్యలు వచ్చినా వెంటనే స్పందించి ఆ సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాడాలని సూచించారు. ప్రతి గ్రామంలో ఏడుగురు రైతులతో కమిటీని ఏర్పాటు చేసుకొని నెలనెలా సమావేశం నిర్వహించాలన్నారు. అలాగే సంవత్సరానికి 4 రైతు పండుగలను జరుపుకోవాలని సూచించారు. నేతలు ఆనంద్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు



గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలోని సీతాయిపల్లి శివారులో మంగళవారం ఆర్టీసీ బస్సు రోడ్డు పక్కన ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. వివరాలు ఇలా.. బాన్సువాడ డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు మంగళవారం ఉదయం ఎల్లారెడ్డి నుంచి బాన్సువాడకు బయలు దేరింది. కొండాపూర్- సీతాయిపల్లి గ్రామాల మధ్య బస్సులో సాంకేతిక లోపం తలెత్తింది. ఈక్రమంలో రోడ్డుపై గుంతల కారణంగా బస్సు అదుపుతప్పి రోడ్డుకు పక్కన పొలాల్లోకి దూసుకెళ్లి, చెట్టు వద్ద నిలిచిపోయింది. ఈ ఘటనలో ప్రయాణికులందరూ సురక్షితంగా బయటపడ్డారు. ప్రయాణికులను డ్రైవర్ డోర్ ద్వారా కిందికి దింపారు. ఘటన సమయంలో బస్సులో సుమారు 20 మంది ప్రయాణికులున్నట్లు స్థానికులు తెలిపారు.